ఆదివారం
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక


# వార్త

వార్త న్యూస్ యాప్
డౌన్లోడ్ చేసుకోండి
DOWNLOAD
: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-11-2025,సోమవారం

# సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

.సౌదీ రోడ్డు ప్రమాదంలో 42మంది దుర్మరణం

.సౌదీ ప్రమాదంలో 16 మంది హైదరాబాద్ వాసులు మృతి!

.ప్రమాదం పై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

.డీజిల్ ట్యాంకర్ ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

**సౌదీ, నవంబర్ 17:**సౌదీ రోడ్డు ప్రమాదంలో 42మంది దుర్మరణం ప్రతి ముస్లీం జీవితంలో ఒక్కసారైనా సౌదీ అరేబియాలో ఉన్న మక్కాను సందర్శించుకోవాలని ఆశిస్తారు.చనిపోయేలాగా తమ ఇష్ దైవమైన అల్లాకు నమస్కరించాలని,ఆ పవిత్ర ప్రదేశంలో నమాజ్ చేసుకుంటే తమ జీవితం ధన్యకరమవుతుందని ప్రపంచంలోని ముస్లింలు భావిస్తారు.అందుకోసం ఆ దేశానికి ప్రతి ఏడాది కోట్లాదిమంది భక్తులు వెళ్తుంటారు.ఇందులో భాగంగా భారతదేశం నుంచి కూడా ఏటా ముస్లింలు సౌదీ అరేబియాకు పయనం అవుతుంటారు.ఇటీవలే మనదేశానికి చెందిన పలువురు ముస్లింలు అకక్కడికి చేరుకున్నారు.అయితే విషాద ఘటన చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాద ఘటన చోటు చేసుకుంది.మక్కా నుంచి మదీనాకు వెళ్లుండగా బదర్ మదీనా ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది.డీజిల్ ట్యాంకర్ ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.దీంతో స్పాట్ లోనే 42 మంది సజీవ దహనం అయ్యారు.వీరిలో 20 మంది మహిళలు ఉండగా..11 మంది చిన్నారు ఉన్నారు.ఎక్కువగా వీరిలో హైదరాబాద్ వాసులు ఉన్నట్లు తెలుస్తోంది.మనదేశానికి చెందిన వారు సైతం మరణించిన వారిలో ఉండడంతో దేశంలోని ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు.సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో కనీసం 16 మంది హైదరాబాద్‌కు చెందిన వారు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది.పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.ప్రమాదం జరిగిన ప్రాంతంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి.అయితే ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.బాధిక కుటుంబాలకు సాయం ఈ బసుస ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడాలని రేవంత్ సూచించారు. బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు చర్యలు చేపట్టానలలి ఆదేశించారు.ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్, విదేశాంగశాఖ అధికారులతో సీఎం మాట్లాడారు.హెల్ప్ లైన్ కోసం సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.వివరాల కోసం 79979 59754, 9912919545 కంట్రోల్ రూం నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.బాధితుల సహాయార్థం చర్యలు సౌదీలో ఉన్న భారతరాయబారి కార్యాలయం సహాయక చర్యల్లో పాల్గొంటోంది. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.



# రాజ్‌భవన్‌లో గవర్నర్, సీఎం-ఉపరాష్ట్రపతి భేటీ

**హైదరాబాద్, నవంబర్17:** ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హైదరాబాద్ పర్యటన ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులతో సందడిగా సాగింది.ఆయన తొలి తెలంగాణ పర్యటన నేపథ్యంలో రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రత్యేక తేనీటి విందుఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,కేంద్ర స్థాయి ప్రముఖులు హాజరై ఉపరాష్ట్రపతికి ఆతిథ్యాన్ని అందించారు.తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,కేంద్ర మంత్రులుకిషన్‌రెడ్డి,బండిసంజయ్ ప్రత్యక్షమయ్యారు.వారికి తోడు పలువురు ప్రజాప్రతి నిధులు,ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ఈసందర్భంగా రాష్ట్ర-కేంద్ర సంబంధాలపై,అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిగాయని వర్గాలు సూచిస్తున్నాయి.బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం పర్యటన ప్రారంభంలోనే బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి గవర్నర్,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయన ఉపరాష్ట్రపతి పదవి స్వీకరించిన తర్వాత తెలంగాణకు రావడం ఇదే తొలి సందర్శన కావడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నంప్రభాకర్,మరికొంతమంది ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ ప్రధానకార్యదర్శితో పాటు అనేకమంది ఉన్నతాధికారులు ఉపరాష్ట్రపతిని పలకరించారు.పర్యటనలో ఆయన రాష్ట్రంలోని పరిపాలనావిధానాలు,అభివృద్ధి కార్యక్రమాలపై వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.తెలంగాణ-కేంద్ర సమన్వయానికి పర్యటన ప్రాధాన్యం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ పర్యటన రాష్ట్ర-కేంద్రాల మధ్య సమన్వయాన్ని పెంచడంలో కీలకంగా ఉండనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.భవిష్యత్‌లో రెండు ప్రభుత్వాల మధ్య మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు,సహకార కార్యక్రమాల రూపకల్పనకు ఇది కొత్త వేదికగా నిలవవచ్చు.

# ఏ.ఐ భవిష్యత్తుపై సత్య నాదెళ్ల వ్యాఖ్యలు




**వాషింగ్టన్, నవంబర్గి17:**ప్రపంచ టెక్ రంగంలో ప్రముఖ వ్యక్తి అయిన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు దిశ గురించి చేసిన ఒకపోస్టు ప్రస్తుతం పెద్దచర్చకు దారితీసింది.ముఖ్యంగా ఆయన అభిప్రాయంపై టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ఇచ్చిన స్పందన సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఒక వేదికను రూపొందించిన సంస్థ కంటే,ఆ వేదికపై పనిచేసే కంపెనీలు మరింత విలువ సృష్టించాలి అన్న బిల్‌గేట్స్ పాతవ్యాఖ్యలను కూడా నాదెళ్ల తన పోస్టులో ప్రస్తావించారు. ఓపెన్‌ఏఐ,ఎన్విడియా,ఏఎండీ వంటి కంపెనీలతో మైక్రోసాఫ్ట్ ఏర్పరుచుకున్న భాగస్వామ్యాలు కూడా ఈ లక్ష్యానికే సేవ చేస్తాయని ఆయన వివరించారు.స్వతంత్రంగా నిర్మించుకోవడం భవిష్యత్ వ్యూహాల్లో కీలకమని అన్నారు.ఇక నాదెళ్ల చేసిన ఈ దీర్ఘ పోస్టుకు ఎలాన్ మస్క్ మాత్రం ఒక్క ఫేస్‌పామ్ ఎమోజీతోనే స్పందించారు.ఈ ఒక్క ఎమోజీతోనే మస్క్ తన అసమ్మతి తెలిపాడా?లేక మరోదృక్పథం ఉందా? అనే చర్చ నెటిజన్లలో రగులుతోంది.ఈ ఇద్దరి ప్రముఖుల అభిప్రాయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి తెరలేపాయి.

# భారతీయులకు ఊరటనిచ్చే కొత్త టారిఫ్స్




**హైదరాబాద్, నవంబర్17:** సొంతదేశంలో వస్తున్న ఫిర్యాదులు అలాగే ఆహార కొరత కారణంగా ట్రంప్ కొన్ని ఆహార ఉత్పత్తుల దిగుమతులపై టారిఫ్ తగ్గిస్తూ ఆయన సంతకం చేశారు.దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని అమెరికన్లు వరుసగా ఫిర్యాదులు చేస్తుండడంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.అయితే ఈ నిర్ణయం కారణంగా అమెరికాలోని కొన్ని వస్తువుల ధరలు భారీగా తగ్గనుండడంతో పాటు ఇండియాకు కూడా కొంత మేలు చేకూరే అవకాశం ఉంది.ప్రజల నుంచి విమర్శలతో ట్రంప్ వెనుకడు.భారత్ తో పాటు పలు ఇతర దేశాల దిగుమతులపై ట్రంప్ 25 శాతం సుంకాలు విధించడం,భారత్ పై ఇంకా అదనంగా మరో 25 శాతం టారిఫ్ భారాన్ని మోపిన విషయం తెలిసిందే.అయితే ఈ సుంకాల కారణంగా అమెరికాలో కొన్ని ఆహారఉత్పత్తుల ధరలుపెరిగిపోయాయి.దాంతో అక్కడి ప్రజలు పెద్దమొత్తంలో కంప్లెయింట్స్ చేశారు.దీంతోపాటు అక్కడి డెమొక్రటిక్ పార్టీ కూడా దీనిపై విమర్శలు చేస్తూ వచ్చింది.ఆ కారణంగా ట్రంప్ టారిఫ్ లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ కొత్త టారిఫ్ రూల్స్ ప్రకారం ట్రాపికల్ పండ్లు,పండ్ల రసాలు,టీ,కాఫీ,సుగంధ ద్రవ్యాలు,కోకో గింజలు, నారింజ,టోమాటో,బీఫ్ వంటి వాటిపై భారీగా టారిఫ్ తగ్గనుంది.ఇది భారతీయ రైతులకు కొంత మేలు చేకూరుతుంది.భారత్ కు కలిసొచ్చే అంశాలు భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల్లో మామిడి పండ్లకు ప్రత్యేక స్థానం ఉంది.గతంలో 2006లో అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ బుష్ మామిడి పండ్లపై నిషేధాన్నిఎత్తవేయగా,ప్రధాని మోదీ ఇటీవల పర్యటన సందర్భంగా ట్రంప్,మోదీల ప్రకటనలో కూడా మామిడి, దానిమ్మఎగుమతుల ప్రస్తావన వచ్చింది.అలాగే గతంలో జనరిక్ ఔషధాలకు టారిఫ్ మినహాయింపు ఇవ్వగా,ఇప్పుడు ఆహార ఉత్పత్తులకు కూడ >>2

# ఎల్లుండి పుట్టపర్తికి ప్రధాని మోదీ



**విజయవాడ, నవంబర్17:** శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలు పుట్టపర్తిలో,రేపు జరిగే రథోత్సవంతో అధికారిక కార్యక్రమాలుప్రారంభం కానున్నాయి.ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తున్న ఈ వేడుకల అధికారిక కార్యక్రమాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.రేపు నిర్వహించే రథోత్సవంతో శతజయంతి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నారు.ఇప్పటికే పుట్టపర్తి పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.ముఖ్య అతిథిగా ప్రధాని మోదీఎల్లుండి పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రధానిమోదీ హాజరు కానున్నారు. రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి,గవర్నర్లు,సీఎంలు వేడుకల్లో పాల్గొంటారు.20,21 తేదీల్లో యువజన సదస్సులు,22న సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవం,23న అధికారిక శతజయంతి వేడుకలను నిర్వహిస్తారు.



## 10వ సారి బీహార్ సీఎం నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారం

**బీహార్, నవంబర్17:** బీహార్ రాజకీయాల్లో చారిత్రక ఘట్టం మరోసారి కనిపిస్తోంది.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 243 సీట్లలో 202 సీట్లను గెలుచుకొని అఖండ విజయం సాధించింది.ఈ విజయంతో జేడీయూ నేత నితీష్‌కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.ఈ చారిత్రక కార్యక్రమానికి ఈ నెల 20వతేదీని ముహూర్తంగా నిర్ణయించారు.ప్రముఖంగా,ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.ఇది బీహార్ రాజకీయాల్లో గణనీయమైన ఘట్టంగా,జాతీయ స్థాయిలో ప్రాధాన్యతను పొందింది.పాట్నాలోని ప్రసిద్ధ గాంధీ మైదాన్ ఈ కార్యక్రమానికి వేదికగా ఉంటుంది.ఎన్డీయే కూటమి అఖండవిజయం,సీట్లు పంపిణీప్రతిపక్ష సమావేశాలు మరియు కేబినెట్ నిర్ణయాల అనంతరం నితీష్ కుమార్ పదవికి రాజీనామా చేశారు. >>2

# హైదరాబాద్‌కు దిగ్గజం మెస్సీ.. సీఎం రేవంత్ రెడ్డితో మ్యాచ్!



**హైదరాబాద్, నవంబర్17:**హైదరాబాద్ క్రీడాభిమానులకు భారీ సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. ప్రపంచ ఫుట్‌బాల్ మేధావి లియోనెల్ మెస్సీ ఈ ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌కు రావచ్చనే సమాచారం వెలువడుతోంది.గోట్ ఇండియా టూర్ 2025"లో భాగంగా నగరంలో ఒక ప్రత్యేక స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహించే అవకాశముందని,ఆ మ్యాచ్‌లోనే సీఎం ఎ.రేవంత్ రెడ్డి మెస్సీతో కలిసి మైదానంలో అడుగుపెట్టవచ్చని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ సంకేతాలిచ్చారు.సీఎం రేవంత్ రెడ్డికి ఫుట్‌బాల్‌పై ఉన్న ఇష్టం,క్రీడల ప్రోత్సాహంపై ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఈ ప్రచారాన్ని మరింతగా ఆసక్తికరంగా మార్చాయి.అథ్లెట్లకు అధునాతన వసతులు రాష్ట్రాన్ని క్రీడా కార్యకలాపాలకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు.సరూర్‌నగర్‌లో జరిగిన కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఇండియా ప్రెసిడెంట్స్ కప్ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ,జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు హైదరాబాద్‌ను హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.అథ్లెట్లకు అధునాతన వసతులు,మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందుతున్నాయని, గచ్చిబౌలిలో జరిగిన ఎన్‌ఎస్‌ఎన్ కరాటే లీగ్ 2025 కార్యక్రమంలో కూడా ఈవిషయాన్నిఆయనపునరుద్ఘాటించారు.

# ఐ బొమ్మ రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా



**హైదరాబాద్, నవంబర్17:**డిజిటల్ యుగంలో చిత్ర పరిశ్రమను అత్యంత వేధిస్తున్న సమస్య పైరసీ.ప్రత్యేకంగా తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వెబ్‌సైట్ సినీ పరిశ్రమకు కోట్ల రూపాయల నష్టానికి కారణమవుతున్నది.ఇటీవల ఐబొమ్మ వెబ్‌సైట్ ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవి ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసారు.ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌తో భేటీ అయ్యారు.అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు.ఐబొమ్మలో 21వేల సినిమాలున్నాయన్నారు. ప్రధాన నిందితుడు రవి నుంచి రూ.3కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు రవి రూ.20కోట్లు సంపాదించినట్లు వెల్లడించారు.దీని వెనక పెద్ద రాకెట్ ఉందని, ఒక వెబ్ సైట్ బ్లాక్ చేస్తే వెంటనే మరో వెబ్ సైట్ ఓపెన్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు.హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు.అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు ఈ భేటీలో పాల్గొన్నారు.ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.50 లక్షల సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని వెబ్ సైట్లో 50 లక్షల సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని సీపీ సజ్జనార్ చెప్పారు.పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని, దీన్ని కట్టడి చేయడానికి ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు.వందకుపైగా పైరసీ వెబ్‌సైట్లతో తన సామ్రాజ్యాన్ని రవి ఏర్పాటు చేసుకున్నారని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.రవి గెట్టింగ్ అప్,ఈఆర్ ఇన్ఫోటెక్ కంపెనీలకు సీఈవోగా ఉన్నారని తెలిపారు.తన టీంతో కలిసి యూకే నుంచి సర్వర్లు హ్యాకింగ్ చేస్తున్నారన్నారు.మరో వెబ్‌సైట్‌ను వాడుకుంటూ సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. >>2

# హైదరాబాద్ యాత్రికుల మృతి అత్యంత బాధాకరం: కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్17:**సౌదీ అరేబియాలో జరిగిన భయానక బస్సు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు యాత్రికులు మరణించడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మృతుల కుటుంబాల పట్ల ఆయన సంతాపం తెలియజేస్తూ, గాయపడిన వారికి వెంటనే నాణ్యమైన వైద్యం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చురుకైన చర్యలు తీసుకోవాలని కోరారు.మక్కా నుంచి మదీనా వెళుతున్న సమయంలో బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో జరిగిన ఈ ప్రమాదం కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు.బాధితుల కోసం అవసరమైన సహాయం ఈ ప్రమాదంలో మరణించిన వారి వివరాలను త్వరగా గుర్తించి,బాధిత కుటుంబాలకి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.గాయపడినవారిని రక్షించేందుకు కేంద్ర విదేశాంగ శాఖతో తక్షణ సమన్వయం చేయాలని సూచించారు.ఈ విపత్కర పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం బాధితుల కోసం అవసరమైన సహాయం,వైద్య సేవలు,మరియు మరిన్ని చర్యల్లో చురుకుగావ్యవహరించాలనిఆయనకోరారు.

## ఐ బొమ్మ రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా

>> వివిధ వీపీఎన్‌లతో పలు లొకేషన్ల మారుస్తూ.వెబ్‌సైట్‌లో సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నారు. పైరసీ సినిమాల అప్‌లోడ్ కోసం వందకు పైగా వెబ్‌సైట్‌లు కొనుగోలు చేశారు. పైరసీ బయటపడి ఒక వెబ్‌సైట్ తొలగించినా.మరో వెబ్‌సైట్‌ను వాడుకుంటూ సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నారన్నారు.రవి ఇంట్లో స్వాధీనం చేసుకున్న వందలాది హార్డ్ డిస్క్‌లలో రెండువేలకు పైగా సినిమాలు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు.పైరసీ నెట్‌వర్క్‌ను ప్రపంచ స్థాయిలో విస్తరించారు.కూకట్‌పల్లిలోని ఆయన ఇంట్లో స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్‌లు,ల్యాప్ టాప్‌లు,మొబైల్ ఫోన్స్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కి తరలించారు. ఇప్పటికే రవిపై 7 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా ఇమ్మడి రవిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్,శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం.ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు.పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు.దీంతో చాలా మంది చనిపోయారు.ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు.ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు.21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి.1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి.రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు.అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం.50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది.ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం అని సజ్జనార్ తెలిపారు.కాగా ఇమ్మడి రవిని అరెస్ట్ చేసి సినిమా పరిశ్రమకు మేలు చేకూర్చిన పోలీస్ సిబ్బందికి దర్శక,నిర్మాతలు,నటులు కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయులకు ఊరటనిచ్చే కొత్త టారిఫ్స్

>> రిలీఫ్ ఇచ్చారు. ఇవన్నీ భారత్ కు కలిసొచ్చే అంశాలే.పలు దేశాల రైతులకు ఊరట అమెరికా గొడ్డు మాంసం ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం ప్రజల్లో ఆందోళన నెలకొంది. గొడ్డుమాంసం ధర పెరగడానికి ట్రంప్ బ్రెజిల్ పై విధించిన టారిఫ్ కారణమని అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. బ్రెజిల్ పై భారీ ఎత్తున టారిఫ్ లు వేయడంతో.అమెరికా మార్కెట్లో బీఫ్ సరఫరా తగ్గింది. దాంతో ధరలు భారీగా పెరిగిపోయాయి.తద్వారా ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ఫలితంగా ధరలను తగ్గించే దిశగా ట్రంప్ టారిఫ్ లను తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కేవలం బీఫ్ మీదే కాకుండా టీ,కాఫీ,ఫ్రైట్స్,స్పైసెస్,టొమాటో వంటి రోజువారీ వస్తువులపై కూడా టారిఫ్ లు తగ్గాయి.దీనివల్ల ఇండియా సహా పలు దేశాల్లోని రైతులకు కొంత ఊరట లభించినట్టయింది.

## 10వ సారి బీహార్ సీఎం నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారం

>> సోమవారం ఉదయం 11:30 గంటలకు జరిగిన చివరి కేబినెట్ సమావేశంలో అసెంబ్లీ రద్దు నిర్ణయం తీసుకోబడింది.తర్వాత రాజీనామా పత్రాన్ని రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు సమర్పించారు.ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధిక్యాన్ని చాటింది.బీజేపీకి 89 సీట్లు,జేడీయూకు 85 సీట్లు లభించగా,కూటమిలోని ఇతర భాగస్వామ్య పార్టీలు ఎల్‌జేపీ 19,హెచ్‌ఏఎం 5,ఆర్‌ఎల్‌ఎస్‌పీ 4 సీట్లను పొందాయి. ఈ ఫలితాలు బీహార్‌లో మరో ఐదేళ్ల పాటు ఎన్డీయే ప్రభుత్వానికి స్థిరత్వాన్ని అందిస్తాయి. నితీష్ కుమార్ 10వసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో,బీహార్ రాజకీయాల్లో మరో చారిత్రక అధ్యాయం మొదలవుతోంది.

# ఈ దేశా పౌరులకు గ్రీన్ కార్డు బ్యాన్ చేసిన ట్రంప్



**వాషింగ్టన్, నవంబర్17:**డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికా వలస వ్యవస్థలో గణనీయమైన మార్పులు చేసే దిశలో ఉంది.న్యూయార్క్ టైమ్స్ ప్రకారం,ప్రస్తుతం ప్రయాణ నిషేధం విధించబడిన కొన్ని దేశాల పౌరులకు గ్రీన్ కార్డు మరియు శాశ్వత నివాస హోదాను అందించడాన్ని ఆపే కొత్త ముసాయిదాలు తయారవుతున్నాయి.ముఖ్యంగా ఆఫ్రికా మరియు మధ్యప్రాచ్యంలోని 12 దేశాల పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రతిపాదన రూపకల్పన చేయబడుతోంది.ప్రస్తుతానికి ఈ దేశాల పౌరులపై అమెరికా ఇప్పటికే తీవ్ర నియంత్రణలు అమలు చేస్తున్నది.ఆఫ్ఘనిస్తాన్,చాడ్,కాంగో రిపబ్లిక్,ఈక్వటోరియల్ గినియా,ఎరిట్రియా,హైతీ,ఇరాన్,లిబియా,మయన్మార్,సోమాలియా,సూడాన్,యెమెన్ పౌరులు ఇప్పటికే అమెరికా ప్రవేశానికి పరిమితులను ఎదుర్కొంటున్నారు.కొత్త ప్రతిపాదన ప్రకారం,వీరి శాశ్వత నివాస కోసం దరఖాస్తులను నిలిపివేయడం,వీసా ఆమోదాలను పరిమితం చేయడం వంటి చర్యలు తీసుకోవచ్చని సూచన ఉంది.పరిమితులు మరియు ప్రత్యేక విరామాలు అయితే,ఈ ప్రతిపాదన క్రమంగాపూర్తి నిషేధం కాదు.ఇప్పటికే గ్రీన్ కార్డు కలిగినవారు,చట్టబద్ధంగా వీసా పొందినవారు,2026 వరల్డ్ కప్ లేదా 2028 ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు,ప్రత్యేక వలస కార్యక్రమంలో అర్హత పొందిన ఆఫ్ఘాన్లకు ఈ నిషేధం వర్తించదు.కానీ తాత్కాలిక వీసా హోదా కలిగినవారు,ఆశ్రయ అభ్యర్థులు,మరియు శాశ్వత నివాసానికి దరఖాస్తు చేసినవారు ఈ కొత్త నియమాల ద్వారా ఎక్కువ ప్రభావితమవుతారు.నిపుణులు విశ్లేషిస్తున్న విధంగా,ఈవిధానాలు వలసదారుల భవిష్యత్తును గణనీయ ంగామార్చగలవు.విద్య,ఉద్యోగం,కుటుంబ భద్రత వంటి విషయాల్లో సవాళ్లను ఎదుర్కోవలసి రావచ్చు.

# కులాంతర ప్రేమ వివాహం ఘోరం: అన్న హత్య




**మహబూబ్‌నగర్, నవంబర్17:**మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో కులాంతర ప్రేమ వివాహం దారుణ హత్యకు దారితీసిన ఘటన వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లా ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌పై అతని తమ్ముడి ప్రేమ వివాహం కోపం తెచ్చినట్లు తెలుస్తోంది.ఈ ఘటన గ్రామాన్ని షాక్‌కు గురిచేసింది.అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్, భవానీలు కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు.కానీ కుల వైవిధ్యం కారణంగా భవానీ తండ్రి వెంకటేశ్ ఈ సంబంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.కుటుంబ పెద్దలు చర్చించినా పెళ్లికి అంగీకరించలేదు.పారిపోయి పెళ్లి – అన్నపై టార్గెట్ తండ్రి ఒప్పుకోకపోవడంతో చంద్రశేఖర్,భవానీలు గ్రామం విడిచి వెళ్లి పెళ్లి చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని రాజశేఖర్ మద్దతు ఇచ్చాడని వెంకటేశ్ అనుమానపడ్డాడు. ఇదే కారణంగా గత కొద్ది రోజులుగా రాజశేఖర్‌పై ఆయనకు కోపం పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. భవానీ తండ్రి వెంకటేశ్ మరో ఐదుగురితో కలిసి రాజశేఖర్‌ను కిడ్నాప్ చేశాడు.అనంతరం అతడిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టి హత్య చేసినట్లు సమాచారం.ఈ దారుణం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.ప్రమాదకరమైన ఈ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు.నిందితుల్లో కొంతమంది పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారు చెప్పారు.మృతుడు రాజశేఖర్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.కులాంతర వివాహాన్ని అంగీకరించకపోవడం వల్ల మరో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.గ్రామస్తులు ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకూడదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రేమపై ద్వేషం,కులం పేరుతో హింస ఇంకా కొనసాగుతుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.

# సిట్‌వద్దకు రాలేను,విచారణకు హైదరాబాద్ కు రండి



**తిరుమల, నవంబర్17:**మాజీ టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి తిరుమల:దేవుని చెంత సేవకుడిగా సేవలందించిన టిటిడిబోర్డు మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ని కల్తీనెయ్యి కేసులో విచారణ చేయడానికి సిబిఐ సిట్ అధికారులు సిద్ధమయ్యారు.ఇందుకోసం ఇప్పటికే ఆయనకు సిట్ అధికారులు గత వారమే నోటీసులు జారీచేశారు.అయితే కొన్ని అనివార్యకారణాల వల్ల 13వతేదీ 16వతేదీ విచారణకు రాలేనని 17వతేదీ తరువాత వస్తానని సమాచారం ఇచ్చారు.ఇప్పుడు ఆయన ఏకంగా శనివారం సిట్ అధికారులకు తనదైన శైలిలో సమాచారం ఇవ్వడం,తనకు ఆరోగ్యం సరిగా లేనందున తిరుపతిలోని సిట్ తాత్కాలిక కార్యాలయానికి రాలేనని,వీలైతే 20వతేదీ హైదరాబాద్ లోని తన ఇంటికి వచ్చి విచారణ చేయవచ్చని తెలిపారు.మాజీ పిఎ చిన్నఅప్పన్న కస్టడీపై ఏసిబి కోర్టు తీర్పు కీలకం దీంతో సిట్ అధికారులు ఇప్పుడు అనుసరించే వ్యూహం ఏంటనేది కల్తీనెయ్యి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న,రిమాండ్లో ఉన్న నిందితుల్లో మరింత ఆందోళన నెలకొందని తెలుస్తోంది. ఇదేసమయంలో వైవి మాజీ పిఎ చిన్నఅప్పన్నను కస్టడీకి తీసుకునే అంశంపై నేడునెల్లూరు ఏసిబికోర్టుతీర్పువెలువరించనుంది. ఒకవేళ కోర్టు కస్టడీకి ఇస్తే అప్పన్నను కూడా హైదరాబాద్కు తీసుకెళ్ళి సుబ్బారెడ్డితో బాటుకలిపి విచారణ చేస్తారా అనేఅనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20వతేదీ విచారణకు వస్తున్నామని సిట్ కూడా ఆయనకు సమాచారం అందించడం విశేషం.

# షేక్ హసీనాకు ట్రైబ్యునల్ కోర్టులో దోషి తీర్పు

**బంగ్లాదేశ్, నవంబర్ 17:**బంగ్లాదేశ్ రాజకీయాల్లో భారీ కలకలం రేపుతున్న తీర్పులు వెలువడ్డాయి.మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదు చేసిన తీవ్రమైన ఆరోపణలపై ట్రిబ్యునల్ కోర్టు దోషిగా తేల్చింది. గత ఏడాది జరిగిన విద్యార్థుల నిరసనలను హింసాత్మకంగా అణచివేయడంలో ఆమె పాత్ర ఉన్నట్టు కోర్టు అభిప్రాయపడింది.కోర్టు వివరాల ప్రకారం,విద్యార్థుల ఉద్యమంపై అమలు చేసిన కఠిన చర్యల వల్ల 1400 మంది ప్రాణాలు కోల్పోయారు.ఇదే కేసులో హసీనా సహా మరో ఇద్దరిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి.ఇవన్నీ పరిశీలించిన ధర్మాసనం అందిన ఆధారాలను నిజమని పరిగణించి హసీనాను దోషిగా తేల్చింది.హసీనా స్పందన:ఇవి తప్పుడు ఆరోపణలు" తీర్పు వెలువడిన వెంటనే హసీనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ,ఇవి పూర్తిగా తప్పుడు ఆరోపణలు.ఈ తీర్పును నేను పట్టించుకోను"అని వ్యాఖ్యానించారు.ఇక ఆమెకు గరిష్ఠ శిక్ష పడే అవకాశముందని కోర్టు స్పష్టం చేసింది.ఈ తీర్పుతో బంగ్లాదేశ్‌లో రాజకీయం మళ్లీ ఉత్కంఠ భరిత దశలోకి వెళ్లింది.హసీనా అనుచరులు కోర్టు తీర్పుని



రాజకీయ ప్రతీకారం అని విమర్శిస్తుండగా,ప్రతిపక్షం మాత్రం దీనిని చట్ట పరంగా న్యాయంగా అభివర్ణిస్తోంది.

# భారత్‌కు చవక ఎల్.పి.జి కి దారి తెరిచిన కొత్త ఒప్పందం



**హైదరాబాద్, నవంబర్15:**భారతదేశం గ్యాస్ అవసరాలను తీర్చేందుకు అమెరికాతో మరో కీలక ఒప్పందం కుదిరిందని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు.ఈ ఒప్పందం ప్రకారం,రాబోయే ఒక సంవత్సరం కాలం పాటు భారత కంపెనీలు అమెరికా నుంచి భారీ స్థాయిలో దిగుమతి చేసుకోనున్నాయి.మొత్తం 2.2(మిలియన్ టన్నులు పర్ అనం) వరకు దిగుమతి చేసుకోవడానికి భారత్ ఒప్పుకుంది.ఇది దేశం వార్షికంగా దిగుమతి చేసుకునే మొత్తంలోదాదాపు10భాగంఅన్నమాట.అంత ర్జాతీయ మార్కెట్లో ధరలు మారుతున్న సమయంలో,ఈ ఒప్పందం భారత లిశిబి సరఫరాలో స్థిరత్వాన్ని తీసుకురావడమే కాకుండా,వినియోగదారులకు తక్కువ ధరలో గ్యాస్ అందేలా చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.ప్రజలకు తక్కువ ధరలో – ప్రభుత్వ లక్ష్యం మంత్రి హర్దీప్‌సింగ్ పూరి మాట్లాడుతూ, అంతర్జాతీయ గ్యాస్ ధరలు పెరిగినా, ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుంటోందని అన్నారు.మార్కెట్ రేటు ప్రకారం ఒక సిలిండర్ ధర 1100 వరకు ఉండాల్సి ఉన్నా,ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సప్లై ఒప్పందాల కారణంగా సాధారణ వినియోగదారులకు అది 500–..550 మధ్యకే లభిస్తోందని తెలిపారు.ఈ అమెరికా ఒప్పందం వల్ల సరఫరా నిరంతరం కొనసాగడమే కాకుండా,ధరలు మరింత స్థిరంగా ఉండే అవకాశం ఉందని కేంద్రం ఆశిస్తోంది.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో,సరసమైన ధరలు అందించడం ప్రభు త్వ ప్రధానలక్ష్యం.భవిష్యత్‌లో మరిన్ని ఇంధన ఒప్పందాలకు మార్గం ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న ప్రోయాక్టివ్ అడుగులలో ఇది ఒకటని అధికారులు చెబుతున్నారు.గ్లోబల్ మార్కెట్‌లో కలుగుతున్న అనిశ్చితి,రవాణా ఖర్చులు,డిమాండ్ పెరుగుదల,ఇవన్నీ పరిష్కరించేందుకు దీర్ఘకాలిక ఫ్యూయల్‌సప్లై ఒప్పందాలు కీలకం అవుతున్నాయి.ఈ డీల్‌తో భారత్ అంతర్జాతీయ ఇంధన వ్యవస్థలో మరింత బలమైన విజిబిలిటీ సాధించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమీర్ రషీద్‌కు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీ




**హైదరాబాద్, నవంబర్15:**ఢిల్లీలో జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తు మరో దశలోకి అడుగుపెట్టింది.ప్రధాన నిందితుడిగా గుర్తించిన అమీర్ రషీద్ అలీను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు సోమవారం ఢిల్లీ కోర్టు ముందు హాజరుపరచారు.కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి,మీడియా ప్రతినిధులను విచారణ సమయంలో కోర్టులోకి అనుమతించలేదు.ఎన్ఐఏ వేసిన విన్నపాన్ని పరిశీలించిన కోర్టు, దర్యాప్తు కోసం అమీర్ రషీద్ అలీకి 10 రోజుల ఎన్ఐఏ కస్టడీను మంజూరు చేసింది.పేలుడు వెనుక ఉన్న ఉద్దేశ్యం,సహచరుల నెట్‌వర్క్,వాడిన పేలుడు పదార్థాల వివరాలు వంటి అంశాలను ఎన్ఐఏ ఈ కస్టడీ సమయంలో లోతుగా పరిశీలించనుంది.అల్ ఫలా ఛైర్మన్ కుటుంబ సభ్యుడిపై కూడా చర్య ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ముఖ్యమైన అరెస్టు మధ్యప్రదేశ్ పోలీసులు చేశారు.అల్ ఫలా ఛైర్మన్ జావెద్ సిద్ధిఖీ సోదరుడు అహ్మద్ సిద్ధిఖీని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు.ఆయన పాత్రపై ఇప్పటికే అనేక సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ అరెస్టు కేసులో కీలక మలుపుగా భావిస్తున్నారు.మధ్యప్రదేశ్ పోలీసులు హైదరాబాదులో చేసిన ఈ ఆపరేషన్‌ను స్థానిక పోలీసులతో కలిసి చేపట్టినట్లు సమాచారం.విచారణలో అహ్మద్ సిద్ధిఖీ నుండి మరిన్ని వివరాలు బయటపడే అవకాశముంది.ఈ అరెస్టు,దేశవ్యాప్తంగా నడుస్తున్న సమన్వయ దర్యాప్తు విధానానికి ఉదాహరణగా నిలిచింది.దర్యాప్తు ఏ దశలో ఉంది? ఎన్ఐఏ ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి పలు ప్రాంతాల్లో సోదాలు చేసింది.పేలుడుజరిగిన ప్రదేశంవద్ద నుంచి సేకరించిన ఫోరెన్సిక్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు,కాల్ రికార్డులు ఆధారంగా నిందితుల నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.దర్యాప్తు అధికారుల ప్రకారం,ఈకేసులో ఇంకా కొద్దిమందిఅనుమానితులుఉన్నారనిభావిస్తున్నారు.

# టంగ్‌స్టన్ తవ్వకాల దిశగా హిందుస్థాన్ జింక్‌కు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ, నవంబర్17:** ఆంధ్రప్రదేశ్‌లో టంగ్‌స్టన్ బ్లాక్‌లను గుర్తించి,వాటిపై అన్వేషణ–తవ్వకాలు ప్రారంభించేందుకు హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ ముందడుగు వేసింది. దీనికి అవసరమైన లైసెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినట్లు సంస్థ వెల్లడించింది.దీంతో రాష్ట్రంలో అరుదైన ఖనిజ వనరుల అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయి.దేశీయ క్రిటికల్ మినరల్స్ రంగానికి ఊతంక్రిటికల్ మరియు స్ట్రాటజిక్ మినరల్స్ అన్వేషణలో భారత్ స్వయం ప్రతిపత్తి సాధించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపింది.విదేశీ దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయిగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.టంగ్‌స్టన్ వినియోగం: పరిశ్రమలకు కీలక లోహంఉష్ణోగ్రతలను తట్టుకునే టంగ్‌స్టన్‌ను అనేక ప్రాధాన్య రంగాల్లో ఉపయోగిస్తారు.లైటింగ్ ఫిలమెంట్లు, రాకెట్ నాజిల్స్,వెల్డింగ్ ఎలక్ట్రోడ్లు,రేడియేషన్ నిరోధక కవచాల తయారీలో ఈ లోహం కీలక పాత్ర పోషిస్తుంది.రక్షణ,అంతరిక్ష పరిశోధన,హైటెక్ తయారీ రంగాల కోసం ఇది అత్యవసర మినరల్‌గా భావిస్తారు.టంగ్‌స్టన్ తవ్వకాలు ప్రారంభమయ్యే




అవకాశం ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ఖనిజ పరిశ్రమలో పెద్ద ఎత్తున పురోగతి నమోదవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఉపాధి అవకాశాలు పెరగడం,పారిశ్రామిక పెట్టుబడులు రాబడిపెరగడం,ప్రభుత్వానికి అదనపు ఆదాయ వనరులు లభించడం వంటి పలు ప్రయోజనాలు రాష్ట్రానికి అందనున్నాయి.ప్రస్తుతం హిందుస్థాన్ జింక్, ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత జింక్ ఉత్పత్తిదారుగా ఉంది. అంతేకాకుండా, ప్రపంచంలోనే మొదటి ఐదు వెండి ఉత్పత్తిదారులలో ఒకటిగా కొనసాగుతోంది. భారత జింక్ మార్కెట్‌లో దాదాపు 77 వాటాను కలిగి ఉన్న ఈ సంస్థ,40కి పైగా దేశాలకు తన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.జింక్,సీసం,వెండికి మాత్రమే పరిమితం కాకుండా, అధునాతన తయారీ రంగానికి అత్యంత అవసరమైన టంగ్‌స్టన్ వంటి ఖనిజాల రంగంలోకి విస్తరించడం.

## దొరికిన ఏటీఎం కార్డుతో డబ్బు తీసిన మహిళకు జైలు



**న్యూఢిల్లీ, నవంబర్17:**రోడ్డు పై నడుస్తూ వెళ్తున్న ఒక మహిళకు యాదృచ్ఛికంగా ఒక ఏటీఎం కార్డు కనిపించింది.కార్డుతో పాటు పిన్ నంబర్ రాసి ఉన్న కాగితం కూడా ఉండటంతో,ఆమె నేరుగా ఏటీఎం సెంటర్‌కి వెళ్లి 50,000 నగదు విత్‌డ్రా చేసింది.తర్వాత అందులో కొంత మొత్తాన్ని బంగారం కొనడానికిఖర్చుచేసి,మిగతా డబ్బును దాచుకుంది.అయితే ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో,పోలీసులు ఆమెనుగుర్తించి అరెస్ట్‌చేసి జైలుకు పంపించారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని వేలూరులో జరిగింది.పూర్తి వివరాల్లోకి వెళితే చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన ఇన్‌బకుమారి,తన కుమార్తె రేచల్‌తో కలిసి కళ్లజోడు కొనుగోలు చేసేందుకు వేలూరు వెళ్లింది.అనంతరం మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయానికి వెళ్లిన సమయంలో,ఆధార్ కార్డ్ జిరాక్స్ కోసం బయటకు వెళ్లిన ఇన్‌బకుమారి హ్యాండ్‌బ్యాగ్ నుంచి ఏటీఎం కార్డు జారిపోయింది.చాలా వెతికినా దొరకకపోవడంతో,కొత్త కార్డు తీసుకోవాలనుకుని తిరిగి వెళ్లింది.50,000 విత్‌డ్రా అయ్యిందని కొద్ది సేపటికి ఆమె ఫోన్‌కు50,000 విత్‌డ్రా అయ్యిందని అలర్ట్ వచ్చింది.వెంటనే ఇన్ బకు మారి వేలూరు దక్షిణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.పోలీసులు కేసునమోదు చేసి,బ్యాంకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా,రాజపాళ్యంకు చెందిన దేవి అనే మహిళ కార్డు ఉపయోగించి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు.పోలీసులు దేవిని అదుపులోకి తీసుకునివిచారించగా,అలాగే డబ్బుతో30,000 విలువైన బంగారు కమ్మలు కొనుగోలు చేసినట్లు వెల్లడించింది.ఆ ఆభరణాల్ని మరియు మిగిలిన నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, దేవిని న్యాయపరమైన చర్యలు తీసుకుంటూ జైలుకు తరలించారు.

## గచ్చిబౌలిలో అనుమతి లేని ఫ్లాట్ లను కూలుస్తున్న హైడ్రా



**హైదరాబాద్, నవంబర్17:**తెలంగాణ ప్రభుత్వం గచ్చిబౌలి ప్రాంతంలో అక్రమంగా నిర్మించినకట్టడాలనుతొలగించే చర్యలను కాస్తవేలు వేగవంతం చేసింది.గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఔట్‌లో అనుమతిలేని నిర్మాణాలను హైడ్రా అధికారులు సోమవారం తెల్లవారుజామునే కూల్చివేయడం ప్రారంభించారు.స్థానిక నివాసితులు గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న ఆక్రమణలను తీసుకుని ఫిర్యాదులు చేసినప్పటికీ పెద్దగా స్పందన రాలేదు.అయితే,హైకోర్టులో విన్నపం చేయడంతో పరిస్థితి మారింది.హైకోర్టు >>3




>> హైకోర్టు ఆదేశాల ప్రకారం రహదారులు, పార్కుల పునరుద్ధరణ సంధ్యా కన్వెన్షన్ సమీపంలోని లేఔట్‌లో రహదారులు,పార్కులు, ఓపెన్ స్పేస్‌లను ఆక్రమిస్తూ నిర్మాణాలు జరగుతున్నాయని నివాసితులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.162 ప్లాట్లు ఉన్న ఈ లేఔట్‌లో సంధ్యా శ్రీధరరావు కొన్ని ప్లాట్లను పెద్ద ఎత్తున కొనుగోలుచేసి, రహదారులకు అడ్డంకి కలిగించే లా కట్టడాలు నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హైకోర్టు ఈ విషయాలను పరిశీలించి,రహదారులు,పార్కులు మరియు సరిహద్దులను ఏవిధంగా అయినా మార్చరాదు అని స్పష్టంగా హెచ్చరించింది.కోర్టు ఆదేశాల ప్రకారం, హైడ్రా అధికారులు సోమవారం ఉదయం భారీ పోలీస్ బందోబస్తుతో కూల్చివేతలు ప్రారంభించారు. రహదారులపై ఏర్పాటైన గోడలు,అనుమతులు లేని షెడ్లు, పెట్రోల్ బంక్ నిర్మాణ సంబంధిత కొన్నిభాగాలను కూల్చివేశారు.ఇప్పుడు లేఔట్‌లో రహదారులు మళ్లీ తెరుచుకోగా,స్థానిక నివాసితులు ఉపశమనం పొందారు.హైకోర్టు అనుమతుల్లేని నిర్మాణాలను తొలగించడం ద్వారా స్థానికుల హక్కులను కాపాడడంలో హైడ్రా ఒక ముఖ్యమైన అడుగును వేసిందని పేర్కొంది.కేసు తదుపరి విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదా పడింది.

## ఆందళోన కలిగిస్తున్న విడాకుల కేసులు..



**హైదరాబాద్, నవంబర్17:** హైదరాబాద్‌లో ఇటీవలవిడాకుల ధోరణిగణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా యువ దంపతుల మధ్యచిన్న విభేదాలు కూడా పెద్ద సమస్యలుగా మారి డివోర్స్ దిశగా దారి తీస్తున్నాయి.ఫ్యామిలీ కోర్టుల రికార్డుల ప్రకారం,నగరంలో ప్రతి నెలా సుమారు 250 విడాకుల కేసులు నమోదవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది.చిన్న సమస్యలకే కోర్టు మెట్లెక్కకుండా 25 నుండి 35 ఏళ్ల మధ్య ఉన్న జంటలు ఎక్కువగా విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది.యువ జంటలుసహనం,సర్దుబాటు, కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చిచిన్నసమస్యలకే కోర్టు మెట్లెక్కకుండా వివాహ బంధాన్ని కాపాడుకోవాలని నిపుణులు కోరుతున్నారు.



## సాగర్ ఎక్స్ రోడ్డు ఫ్లైఓవర్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్, నవంబర్17:**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్,ఎమ్మెల్యేలు ఆలేటి మహేశ్వర్ రెడ్డి,పవార్ రామారావు పాటిల్‌తో కలిసి నాగ్‌పూర్‌లో కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. సాగర్ ఎక్స్ రోడ్డు (నాగార్జునసాగర్ క్రాస్ రోడ్డు) వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం ఇవ్వాలని కోరగా,మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అధికారిక ప్రకటన చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు.హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలపై చర్చ మెట్రో నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ భారం రోజురోజుకూ పెరుగుతోంది.లక్షలాది మంది ప్రతిరోజూ ఈ మార్గాల్లో ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు తీవ్రంగా కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో,నగరంలోని పెండింగ్‌లో ఉన్న రహదారి, ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఈటల రాజేందర్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు.ఉప్పల్ ఫ్లైఓవర్,కొంపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాలు కేంద్ర నిధులతో జరుగుతున్నప్పటికీ, పనులు ఆశించినంత త్వరగా సాగడం లేదని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని వివరించి, పనులను వేగవంతం చేయాలని కోరగా, దీనిపై మంత్రి వెంటనే అధికారులతో సమీక్షిస్తామని హామీ ఇచ్చారు.సాగర్ ఎక్స్ రోడ్డు ఫ్లైఓవర్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం బాలానగర్–నరసాపూర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా పెరగడం,అలాగే నాగార్జునసాగర్ క్రాస్ రోడ్డు నుంచి అమరావతి దిశగా కొత్త జాతీయ రహదారి నిర్మాణ ప్రణాళికలు ఉండటంతో ఈ కూడలి భవిష్యత్తులో అత్యంత రద్దీ జంక్షన్‌గా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సాగర్ ఎక్స్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని వివరించగా, మంత్రి గడ్కరీ ప్రాధాన్యతను గుర్తించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం తెలంగాణ ప్రజలకు మంచి శుభవార్తగా నిలిచింది.గతంలో అధికారులుఇచ్చిన గడువులన్నీ పూర్తయ్యాయని.. ఈ పనులను వేగవంతం చేయడానికి కేంద్రం చొరవ తీసుకొని అధికారులతో వెంటనే సమీక్ష నిర్వహించాలని కోరారు.దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి.వెంటనే అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.



# పుష్ప రీరిలీజ్ క్యాన్సిల్.. పుష్ప 3పై ఫోకస్!




**టాలీవుడ్, నవంబర్17:**పుష్ప 1 మరియు పుష్ప 2 సినిమాలను ప్రత్యేకంగా మళ్లీ ఎడిట్ చేసి రీరిలీజ్ చేయాలన్న అభిమానుల ఆలోచనను అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ వినయపూర్వకంగా తిరస్కరించినట్లు తెలిసింది.పుష్ప 2 ఇటీవలే విడుదలై ఉండటంతో ప్రస్తుతం రీరిలీజ్ చేయడం సరైన నిర్ణయం కాదని వారు భావించినట్లు సమాచారం.మరోవైపు,సుకుమార్ రామ్ చరణ్‌తో చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాతే పుష్ప 3 పనిలోకి వెళ్లాలని యోచిస్తున్నారు.ఇటీవలి కాలంలో పాత సినిమాల రీ రిలీజ్ ట్రెండ్ బాగా పెరిగింది. నాగార్జున నటించిన కల్ట్ క్లాసిక్ శివ 4రీ రీరిలీజ్ పెద్ద విజయాన్ని సాధించింది. అంతేకాదు, మళ్లీ విడుదలవుతున్న సినిమాల్లో పాతవే కాదు, కొన్నేళ్ల క్రితం వచ్చిన బ్లాక్‌బస్టర్లు కూడా మంచి వసూళ్లు సాధిస్తున్నాయి.ముఖ్యంగా భారీ యాక్షన్ చిత్రాలకు ఈ ట్రెండ్ ఎంతో ఉపయోగపడుతోంది. ఉదాహరణకు,బాహుబలి స్పెషల్ ఎడిట్ వెర్షన్‌కు 50 కోట్లకు పైగా వసూళ్లు వచ్చిన సంగతి తెలిసిందే.అల్లు అర్జున్,సుకుమార్ ఈ ప్రతిపాదనను ఈ విజయాల నేపథ్యంలో పుషఅభిమానులు కూడా రెండు భాగాలను కట్ చేసి ప్రత్యేక వెర్షన్‌గా థియేటర్లకు తీసుకురావాలనే ప్లాన్ చేశారు.అయితే అల్లు అర్జున్, సుకుమార్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లలేకపోయారు.కారణం పుష్ప 2 తాజాగా విడుదల కావడం.బాహుబలి లాంటి 10 ఏళ్ల పాత చిత్రానికి రీరిలీజ్ పనిచేస్తే, కొత్తగానే వచ్చిన సినిమాకు అదే స్థాయి రెస్పాన్స్ రావడం కష్టమనే అభిప్రాయానికి వారు వచ్చారని తెలుస్తోంది.అదనంగా,సుకుమార్ ప్రస్తుత ప్రాజెక్ట్‌తో బిజీగా ఉండటం వల్ల పుష్ప స్పెషల్ కట్ పనులకు సమయం కేటాయించటం సాధ్యం కాకపోవడం కూడా కారణాలలో ఒకటి.అందుకే పుష్ప రీరిలీలో ఆగిపోయినట్టే. మరోవైపు,సుకుమార్ రామ్ చరణ్ సినిమా పూర్తి చేసిన తర్వాతే పుష్ప 3 స్క్రిప్ట్‌పై దృష్టి పెట్టనున్నారు.అల్లు అర్జున్ కూడా అట్లీ దర్శకత్వంలో చేస్తున్న తన కొత్త సినిమా పూర్తయిన తరువాతే పుష్ప ఫ్రాంచైజ్‌కు తిరిగి వస్తారని సమాచారం. అందుకే రీరిలీజ్ జరగకపోయినా,పుష్ప 3 కోసం ఈ ఇద్దరూ మళ్లీ కలుసుకోబోతున్నారన్న వార్త అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# శుభ్‌మన్ డిశ్చార్జ్.. కానీ మ్యాచ్ డౌట్



**న్యూఢిల్లీ, నవంబర్ 17:**టీమ్ ఇండియా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఆస్పత్రి నుంచి అధికారికంగా డిశ్చార్జ్ చేసినట్టు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.తొలి టెస్టు సమయంలో అతడికి వచ్చిన తీవ్రమైన మెడ నొప్పి తగ్గినా,డాక్టర్లు వచ్చే 4–5 రోజులపాటు పూర్తి విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.గిల్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనే అసౌకర్యం ఎక్కువై మైదానాన్ని వెంటనే వదిలి బయటకు రావాల్సి వచ్చింది.అనంతరం వైద్య పరీక్షల కోసం అతడిని ఆస్పత్రికి తరలించగా,అక్కడ పూర్తి పరిశీలన జరిపినట్లు సమాచారం. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉన్నప్పటికీ,మరలా ఒత్తిడికి గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.రెండో టెస్టు కోసం అనిశ్చితి–5050 అవకాశాలు ఈ నెల 22 నుంచి గువాహటిలో జరగనున్న రెండో టెస్టులో గిల్ ఆడే అవకాశాలపై ఇంకా స్పష్టత లేదు.గిల్ ఆరోగ్య పరిస్థితిని గమనిస్తే, అతడికి మ్యాచ్‌లో పాల్గొనడం 5050 పరిస్థితిలో ఉందని జట్టు వర్గాలు సూచిస్తున్నాయి.గువాహటి వాతావరణం, పిచ్ స్వభావం,అతడి ఫిట్‌నెస్ రికవరీ స్పీడ్–ఇవన్నీ కలిపి జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని ప్రభావితం చేసే అంశాలుగా మారాయి.టెస్టు సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌కు గిల్ అందుబాటులోకి వస్తే జట్టు బలపడుతుంది. లేకుంటే ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పులు తప్పనిసరైయ్యే అవకాశం ఉంది.ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తరువాత జట్టు ప్లాన్‌గిల్ ప్రస్తుతం రిహాబ్ దశలో ఉన్నాడు.ఫీజియోథెరపీ,స్ట్రేటచింగ్,లైట్ మొబిలిటీ వర్కౌట్స్తో మెడ మసిల్స్‌పై ఒత్తిడి పడకుండా కోలుకునేలా వైద్య బృందం ప్రత్యేక షెడ్యూల్ రూపొందించింది.జట్టు మేనేజ్‌మెంట్ కూడా గిల్ రికవరీని రోజు వారీగా మానిటర్ చేస్తోంది. అతడి ఫిట్‌నెస్‌పై చివరి నిర్ణయం రెండో టెస్టుకు రెండు రోజుల ముందు ప్రకటించే అవకాశం ఉంది.

# ఫ్రాంచైజీల పర్సుల యుద్ధం ప్రారంభం!




**న్యూఢిల్లీ, నవంబర్ 17:**క్రికెట్ అభిమానులు ఆత్రుతగా ఎదురు చూసే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌కు సంబంధించిన వేడుకలు మొదలయ్యాయి.రాబోయే నెలలో జరగనున్న ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్‌పై ఇప్పటికే హోరాహోరీ చర్చలు నడుస్తున్నాయి.ఈసారి వేలాన్ని ప్రత్యేకంగా విదేశాల్లో నిర్వహించబోతున్నట్టు బీసీసీఐ ప్రకటించడంతో ఉత్సుకత మరింత పెరిగింది.ఇప్పటికే టోర్నమెంట్‌లో భాగమైన 10 ఫ్రాంచైజీలు తమ రిటైన్ చేసిన ఆటగాళ్ల జాబితాను ప్రకటించాయి. మొత్తం 173 మంది ప్లేయర్లు రిటైన్ కాగా, వారిలో 49 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. రాబోయే వేలంలో టీమ్‌లు మొత్తం 77 స్లాట్‌లను నింపే అవకాశం ఉంది.వేలం తేదీ,వేదిక పర్సు వివరాలు బీసీసీఐ ఇటీవల ప్రకటించిన వివరాల ప్రకారం,ఐపీఎల్ 2026(2026) మినీ ఆక్షన్ డిసెంబర్ 16న అబుదాబిలోని ఎతిహాద్ అరేనాలో జరుగనుంది.విదేశీ వేదికలో వేలం కావడం ఇదే మొదటిసారి కాదు, కానీ ఈసారి జరగబోయే ఈవెంట్ మరింత గ్రాండ్‌గా ఉండబోతుందని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి.అన్ని జట్ల పర్సులను కలిపి చూస్తే,ఈ మినీ ఆక్షన్ కోసం మొత్తం ..237.55 కోట్లు అందుబాటులో ఉన్నాయి.ఒక జట్టులో గరిష్ఠంగా 25 మంది ఆటగాళ్లు ఉండవచ్చనే నిబంధన ప్రకారం, పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం 21 ప్లేయర్లతో, గుజరాత్ టైటాన్స్ మరియు ముంబై ఇండియన్స్ చెరో 20 ప్లేయర్లతో వేలానికి సిద్ధమవుతున్నాయి.కేకేఆర్ మాత్రం భారీ మొత్తం64.3కోట్లు పర్సులో ఉంచుకొని దూసుకెళ్లే అవకాశాలున్నాయి.ఆండ్రే రసెల్ మరియు వెంకటేశ్ అయ్యర్ వంటి స్టార్ క్రికెటర్లను విడుదల చేయడం వల్లే ఈ భారీ స్పేస్ వచ్చింది.మరోవైపు,సన్‌రైజర్స్ హైదరాబాద్ వద్ద 25.5 కోట్లు,రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు,సీఎస్‌కే వంటి జట్లు కూడా తమ అవసరాలను బట్టి భారీ ప్లాన్‌లు సిద్ధం చేస్తున్నాయి.అయితే ముంబై ఇండియన్స్ మాత్రం అతి తక్కువ మొత్తమైన 2.75 కోట్లు మాత్రమే పర్సులో ఉంచుకొని వేలానికి అడుగుపెడుతోంది.ఎందుకంటే వారు తమ ప్రధాన ఆటగాళ్లను దాదాపు అందరినీ రిటైన్ చేసుకున్నారు.ఈ పరిస్థితుల్లో వారిది చాలా స్ట్రాటజిక్ వేలం కానుంది.

# సీక్రెట్ ఈవెంట్‌లో ప్రభాస్ న్యూ లుక్ షాక్!



**టాలీవుడ్, నవంబర్17:**పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కొత్తగా దర్శనమిచ్చిన తాజా లుక్ సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది.చాలా రోజుల తర్వాత ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు హాజరైన ఆయన,ప్రత్యేక అతిథులైన ఏపీ డిప్యూటీ స్పీకర్,నటుడు సుబ్బరాజుతో కలిసి ఫొటోలు దిగారు.ఈ ఫొటోలు వెలుగులోకి రావడంతో ఫ్యాన్స్ సోషల్ మీడియానునింపేశారు.సాధారణంగా తలపై క్లాత్ కప్పుకుని కనిపించే ప్రభాస్ ఈ సారి పూర్తిగా వేరే స్టైల్‌లో కనిపించడం అభిమానులకు పెద్ద సర్ప్రైజ్‌గా మారింది.ఆయన కొత్త లుక్‌లో సింపుల్‌గా, స్టైలిష్‌గా, చాలా రిఫ్రెష్‌గా కనిపించారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఈవెంట్‌లో ఆయన కెమెరా ముందు నిలబడిన ఆ క్షణాలు ఒక్కో ఫోటోగా ఫ్యాన్ పేజీల్లో వైరల్ అవుతున్నాయి.రాజాసాబ్ నుంచి స్పిరిట్ వరకు–ప్రభాస్ బిజీ షెడ్యూల్ ప్రస్తుతం ప్రభాస్ పలు భారీ బడ్జెట్ చిత్రాలతో బిజీగా ఉన్నారు.ఆయన నటిస్తున్న రాజాసాబ్ షూటింగ్ వేగంగా సాగుతోంది.ఇది పూర్తిగా రొమాంటిక్–డ్రామా టోన్‌లో రూపొందుతున్న సినిమాకావడంతో ఫ్యాన్స్‌లో ఆసక్తి పెరిగింది.అదే విధంగా,ప్రభాస్–సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్ కూడా దేశవ్యాప్తంగా భారీ అంచనాలు తెచ్చుకుంది.యాక్షన్ ఎంషన్‌లతో సాగనున్న ఈ సినిమా హీరో ఇమేజ్‌కు బలమైన డెఫినిషన్ ఇవ్వబోతుందనే ప్రచారం ఉంది.ఇక ఆయన చేస్తున్న మరో ప్రాజెక్టు ఫౌజీ,కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇది మిలిటరీ నేపథ్యం,దేశభక్తి ఎలిమెంట్లతో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.మూడు భారీ సినిమాలు ఒకేసారి షూటింగ్‌లో ఉండటంతో ప్రభాస్ షెడ్యూల్ నిజంగా నెమ్మదిగా కాదు పూర్తిగా నిండిపోయింది.

# గంభీర్ పై నెటిజన్లు ఫైర్




**న్యూఢిల్లీ, నవంబర్ 17:** నిన్న సౌతాఫ్రికా చేతిలో భారత్ ఓటమి తర్వాత సోషల్ మీడియాలో అభిమానులు తీవ్రఅసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న నిర్ణయాల పై నెటిజన్లు మండి పడుతున్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో పదేపదే ఎందుకు మార్పులు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.నలుగురు స్పిన్నర్లు ఎందుకనిస్పెషలిస్టు బ్యాటర్ సాయి సుదర్శన్‌ను ఆడించకుండా నలుగురు స్పిన్నర్లు ఎందుకని నిలదీస్తున్నారు.గతేడాది విత్రో వైట్‌వాష్ అయినా పాఠాలు నేర్వకుండా మళ్లీ స్పిన్ పిచ్‌లే ఎందుకు తయారుచేశారని ప్రశ్నిస్తున్నారు.

# పోలీసులకు పవన్‌కల్యాణ్ అభినందనలు



**టాలీవుడ్, నవంబర్17:**ఐబొమ్మ రవిని అరెస్ట్ చేయడం పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌స్పందించారు.డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలను విడుదలైన రోజునే ఇంటర్నెట్ లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది.సినిమా విడుదలే ఒక మహా యజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు.పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్ సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, అతనితోనే వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసు బృందం చేసిన ఆపరేషన్ విజయవంతమైంది.ఈ ఆపరేషన్లో భాగమైన పోలీసులకు,సిటీ కమిషనర్ శ్రీ వి.సి.సజ్జనార్‌కి అభినందనలు తెలియచేస్తున్నాను.బెట్టింగ్ మాఫియా,పొంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి,వాటి వల్ల ప్రజలు ఏ విధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో చైతన్యవరుస్తున్నారు.ఆయనతో ఓ సందర్భంలో సమావేశమైనప్పుడు పొంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏ విధంగా మోసానికి గురై నష్టపోతున్నారో వివరించారు.రవి సమాజానికి రెండు రకాలుగా నష్టం చేకూర్చాడు అలాగే బెట్టింగ్ యాప్స్ ను నియంత్రించేందుకు శ్రీ సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయి" అని పవన్ తెలిపారు.పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు నష్టం చేస్తున్న ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనర్ సోమవారం వెల్లడించారు.ఇమ్మడి రవి పై ఐటీ యాక్ట్,కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు మీడియా సమావేశంలో చెప్పారు.పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సినీపెద్దలు చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు, సురేశ్ బాబుతో పాటు దర్శకుడు రాజమౌళి సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు.అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం.ఇమ్మడి రవి సమాజానికి రెండు రకాలుగా నష్టం చేకూర్చాడు.పైరసీ ద్వారా చిత్రపరిశ్రమకు కోట్ల నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్‌చేశాడని తెలిపారు.దీంతో చాలామందిడబ్బు,ప్రాణాలుకోల్పోయారు.

# అజయ్ భూపతి సినిమాలో హీరోయిన్‌గా రాషా తదాని

**టాలీవుడ్, నవంబర్17:** తెలుగు సినీప్రేక్షకుల్లో ఎప్పుడూ కొత్తదనంకోసం ప్రయత్నించే దర్శకుల్లో అజయ్ భూపతి ఒకరు.ఆర్ఎక్స్ 100,మహాసముద్రం వంటి సినిమాలతో తనకంటూ ముద్రవేసుకున్న ఆయన, తాజాగా తన నాలుగో చిత్రాన్ని ప్రకటించారు.ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నది మరెవరో కాదు సూపర్‌స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు,లెజెండరీ నటుడు కృష్ణగారి మనవడు,ఘట్టమనేని రమేష్ బాబుగారి కుమారుడు అయినఘట్టమనేనిజయకృష్ణ. రాషాతదాని ఎంచుకున్నారని ఇప్పుడుఈ సినిమాలో హీరోయిన్ ఎవరన్న విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ,హీరోయిన్ గా రాషాతదాని ఎంచుకున్నారనిటీమ్ తెలియజేసింది.ఆమె రవీనాటాండన్,అనిల్ తదానికుమార్తె.రాషా గతంలో సినిమాలో కనిపించి, "ఉయ్ అమ్మ" సాంగ్ ద్వారా పెద్ద పాప్యులారిటీని సంపాదించారు.ఇప్పుడు ద్వారా ఆమె తొలి సారి టాలీవుడ్ లో అడుగుపెడతున్నారు.




# పాక్‌కు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఆర్మీ చీఫ్



**న్యూఢిల్లీ, నవంబర్ 17:**దాయాది పాకిస్థాన్ కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఈ ఏడాది మేలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమేనని అన్నారు.దాయాది ఏదైనా దుశ్చర్యలకు పాల్పడితే గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉపేంద్ర ద్వివేది ఈ సందర్భంగా మాట్లాడారు."ఆపరేషన్ సిందూర్ 88 గంటల్లో ముగిసిన ట్రైలర్ మాత్రమే.భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులకైనా మేం సిద్ధంగా ఉన్నాం.పాక్ అవకాశం ఇస్తే.పొరుగుదేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో దాయాదికి మేము నేర్పిస్తామ్ము అని వ్యాఖ్యానించారు.పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు.భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల శ్రేయస్సు,పురోగతిపై దృష్టి పెడుతుందని జనరల్ ద్వివేది తెలిపారు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే.దీటుగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే దేశాలతో చర్చలు ఉండవని తేల్చి చెప్పారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తూ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని దాయాది పాక్‌కు జనరల్ ఉపేంద్ర ద్వివేది గట్టిగా హెచ్చరించారు.

# బ్యాంకుల విలీనం పై జోరందుకుంటున్న ఊహగానాలు

**న్యూఢిల్లీ, నవంబర్ 17:** గత కొన్ని రోజులుగా దేశంలో బ్యాంకుల విలీనం గురించి పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి.నిపుణులు అంచనా వేస్తున్నారంటే,మళ్లీ కొన్ని ప్రభుత్వ బ్యాంకులను కలిపి పెద్ద బ్యాంకులుగా తీర్చే అవకాశంఉన్నట్టు కనిపిస్తుంది.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే చిన్న బ్యాంకులను విలీనం చేసి,వాటిని అంతర్జాతీయ స్థాయిలో పోటీ చేయగలిగే పెద్ద సంస్థలుగా మార్చాల్సిన అవసరం ఉన్నట్టు తెలిపారు.ప్రైవేటైజేషన్ కాకుండా,విలీనం ద్వారా రాష్ట్ర బ్యాంకులు మరింత బలపడి,దేశీయ,అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరత్వం పొందుతాయని ఆయన సూచించారు.2020లో జరిగిన బ్యాంకుల విలీనం ప్రకారం,27ప్రభుత్వ బ్యాంకులను 12కి తగ్గించారు.ఉదాహరణకు,ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్,యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంకులో విలీనమయ్యాయి. ఆంధ్రా బ్యాంక్,కార్పొరేషన్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ఆఫ్ ఇండియాలో విలీనమయ్యాయి.సిండికేట్ బ్యాంకు కెనరా బ్యాంకులో, అలహాబాద్ బ్యాంక్ ఇండియన్ బ్యాంకులో విలీనమయ్యింది. చిన్న బ్యాంకులు విలీనం అయ్యే అవకాశముంది ఇప్పటి ప్రణాళిక ప్రకారం,యూనియన్ బ్యాంక్ ఆఫ్ఇండియాలో బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీనం అవ్వవచ్చని అంచనా ఉంది.ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వంటి చిన్న బ్యాంకులు విలీనం అయ్యే అవకాశముంది.లేదా కొన్ని చిన్న బ్యాంకులను పంజాబ్ నేషనల్ బ్యాంకులో కలపవచ్చు. ఈ విలీనం పూర్తయిన తరువాత,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,పంజాబ్ నేషనల్ బ్యాంక్,కెనరాబ్యాంక్,బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పెద్దబ్యాంకులు ప్రధానంగా పనిచేయనున్నాయి. కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది రాదు; వారు కొత్త పెద్ద బ్యాంకుల కస్టమర్లుగా మారతారు.

